విశ్వావసుకు ఘన స్వాగతం

శివ్వంపేట: పిల్లుట్లలో రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


పాపన్నపేట: వనదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


వెల్దుర్తి: చర్లపల్లిలో పంచాంగం వింటున్న గ్రామస్తులు


ఏడుపాయల్లో అమ్మవారి సన్నిధిలో అదనపు కలెక్టర్ నగేశ్ దంపతులు

తెలుగు సంవత్సరాది ఉగాది.. విశ్వావసు నామా నూతన సంవత్సరానికి ఊరూ వాడా ఘనంగా స్వాగతం పలికారు. పండుగ సందర్భంగా తీపి, చేదు, వగరు, పులుపు, కారం లాంటి మామిడి, వేప, బెల్లం, కారం, ఉప్పుతో తయారు చేసిన షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ప్రతి ఇంటా అందరూ సేవించారు. ఇండ్లకు మామిడి తోరణాలతో అలంకరించారు. ఉగాది ప్రత్యేక వంటకాలైన భక్ష్యాలు(పోలెలు), పిండి వంటలు చేసుకుని ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకొన్నారు. అనంతరం సాంప్రదాయ దుస్తులు ధరించి, సమీప ఆలయాలకు వెళ్లారు. ఆలయాల్లో వేద బ్రాహ్మణులు పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రజలు తమ పేర్లపై ఆదాయ, వ్యయాలను తెలుసుకున్నారు. ఆలయాలకు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసిన పూజారులు ఉగాది పచ్చడిని భక్తులకు వితరణ చేశారు. కొన్ని యువజన సంఘాలు పచ్చడిని పంచిపెట్టాయి. అనంతరం యువత ఒకరినొకరు తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొన్ని గ్రామాల్లోని ఆలయాల్లో బండ్ల ఊరేగింపు నిర్వహించారు. మరికొన్ని గ్రామాల్లో చావిడి వద్ద పంచాంగ పఠనం జరిగింది. శివ్వంపేట మండలం పిల్లుట్లలో ఉగాది రోజు నిర్వహించే భర్మస్వామి (వేంకటేశ్వరస్వామి) రథోత్సవానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా వచ్చి దర్శించుకున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, మార్చి 30

రామాయంపేట: కుండలు, ఇతర వస్తువుల అమ్మకాలు

- ఆలయాల్లో ఉగాది పచ్చడి వితరణ చేసిన అర్చకులు, యువజన సంఘాల నాయకులు
- ప్రధాన కూడళ్లలో పంచాంగ పఠనం, శ్రవణాలు
- భర్మస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఏడుపాయల దుర్గామాతను దర్శించుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

పెద్దశంకరంపేటలో బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

చేగుంట: కర్నాల్‌పల్లిలో దేవతలకు అభిషేకం చేసేందుకు గంగాజలాలతో వెళ్తున్న మహిళలు, యువతులు


నిజాంపేట: ఎల్లమ్మ,జమదగ్ని మహర్షి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

చిలిపిచెడ్: అజ్జమర్రిలో బండ్లు ఊరేంగిస్తున్న రైతులు

మెదక్ మున్సిపాలిటీ: అంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

మనోహరాబాద్‌లో పంచాంగ శ్రవణాన్ని ఆలకిస్తున్న గ్రామస్తులు

అడవిపంది ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

ఆటో డ్రైవర్ భానుచందర్ మృతదేహం

రామాయంపేట, మార్చి 30: అడవిపంది ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఓ వ్యక్తి అక్కడికక్కడికే మృతి చెందాడు. ఈ ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుతారిపల్లి గ్రామ శివారులో శనివారం అర్ధ రాత్రి జరిగింది. ఎస్సై బాలరాజు కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన భానుచందర్(24) ఆటో డ్రైవర్. ఉగాదికి హైదరాబాద్ నుంచి రామాయంపేట మండలం సుతారిపల్లిలో ఉన్న అమ్మమ్మగారి ఇంటికి సొంత ఆటోలో వస్తున్నాడు. సుతారిపల్లి గేటు మూలమలుపు వద్ద అడవిపంది ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న భానుచందర్ ఎగిరి బయటపడి మృతిచెందాడు. ఆటోలో ఒక్కడే ఉండడంతో సుతారిపల్లిలో ఉన్న అతడి బంధువులు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి గ్రామం నుంచి బైక్‌లపై రామాయంపేటకు బయల్దేరారు. సుతారిపల్లి గేటు దగ్గరే ఆటో బోల్తాపడి విగత జీవుడిగా భానుచందర్ కనిపించాడు. అడవిపంది కూడా అక్కడే పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతున్న దుబ్బరాజయ్య

రామాయంపేట, మార్చి 30: వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై బాలరాజు కథనం ప్రకారం.. ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఎక్సెల్ వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరో ఘటనలో అక్కన్నపేటకు చెందిన దుబ్బరాజయ్య గ్రామ రోడ్డులో కాలినడకన వెళ్తున్నాడు. క్రేన్ వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుబ్బరాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి రోడ్డుపై ఉన్న క్రేన్ వాహనాన్ని పక్కకు తొలిగించారు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

రెడ్డిపల్లిలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహిస్తున్న యువకులు

నర్సాపూర్, మార్చి 30: మండలంలోని రెడ్డిపల్లిలో యువకులు ఆదివారం శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యువకులు బాలకృష్ణ, దేగ్లేందర్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, రాజుగౌడ్, నవీన్, నరసింహాగౌడ్, ముత్యాలు, నరసింహాచారి, శేఖర్, భానుప్రసాద్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ యువ నాయకులు


శేరి సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 30: ఎమ్మెల్సీగా ఆరేండ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న శేరి సుభాష్‌రెడ్డిని బీఆర్ఎస్ యువ నాయకులు కసాపురం కిరణ్, రంజిత్ నాయక్, మహేశ్, నవీన్, తరుణ్, మధు, రాకేశ్, వినయ్, దశరథం ఆదివారం హవేళీఘనపూర్ మండలంలోని కూచన్‌పల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిసి ఘనంగా సన్మానించారు.

మల్లన్న కమాన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నిజాంపేట,మార్చి30: చల్మెడలో నిర్మించిన మల్లన్న కమాన్‌ను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదివారం ప్రారంభించారు. మల్లన్న ఆలయ చైర్మన్ మల్లేశం, తిరుమల ఆలయ చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచులు నర్సింహారెడ్డి, ముత్యంరెడ్డి ఉన్నారు.

బాటసారుల దాహార్తిని తీర్చాలి: ఎస్సై

తూప్రాన్, మార్చి 30: తూప్రాన్ మండల లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ ఎస్ఐ శివానందం హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు రేపల్లి నాగరాజు, లంగారు శ్రీనివాస్ రావు, రాము, జంగం కృష్ణలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ గుడికి రూ. 51వేల విరాళం

శివ్వంపేట, మార్చి 30: శివ్వంపేట మండలం లింగోజిగూడ గ్రామ పంచాయతీ తండాలో సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.51 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. తండాప్రజలు అడిగిన వెంటనే విరాళం అందజేసిన మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తాకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవినాయక్, సులోచన నర్సింహారెడ్డి, నాయకులు మాలోత్ రమేశ్, మెగావత్ రాజు, మాలోత్ గోప్య, గోపాల్, సత్యనారాయణ, సుదీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు ఈద్-ఉల్-ఫితర్

- ముగిసిన రంజాన్ ఉపవాసాలు
- దానధర్మాల పండుగకు సిద్ధమైన ముస్లింలు
- ప్రార్థనల కోసం ఈద్గాలు, మసీదులు ముస్తాబు

మెదక్‌లో ప్రార్థనలు చేసే ఈద్గా మైదానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 30: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా అధ్యాత్మిక చింతనలో గడుపుతున్న ముస్లింలు, దాన ధర్మాల పండుగలా భావించే 'ఈద్-ఉల్-ఫితర్'ను నేడు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు. సామరస్య భావాలకు, సమున్నత జీవన విధానానికి ప్రతీకగా, పరస్పర ప్రేమ, శాంతి, సహనాన్ని ప్రబోధించిన రోజుగా భావించే ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గాలను ముస్తాబు చేశారు. మార్చి 2న రంజాన్ మాసం ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు, దీక్ష విరమించి ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. నిరుపేదలకు విస్మరించకూడదనే తాఖీదును అనుసరించి ప్రతి ముస్లిం తనకు తోచిన మేరకు ఫిత్రా (దానం) చేస్తారు. పేద, ధనిక వ్యత్యాసం లేకుండా కుటుంబ సభ్యులందరి తరపున ఫిత్రా చెల్లించాలనేది వారి నియమం. రంజాన్ చివరి ఉపవాసం రోజు నెలవంక చూశాక ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు ఫిత్రా చెల్లిస్తారు. నిర్భాగులు సైతం పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలనేది దీని సారాంశం అందులో ఉంది. పండుగ రోజున ముస్లింలు కొత్త బట్టలు ధరించి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈద్గాల్లో ప్రార్థనల అనంతరం మత పెద్దల సందేశాలను శ్రద్ధగా వింటారు. ఆలింగనాలు చేసుకుని పరస్పర శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి

ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగను చేసుకోవాలని మత పెద్దలు పేర్కొన్నారు. దీంతో పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకోవడానికి జిల్లా కేంద్రం మెదక్‌లోని ఈద్గా, మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. నవాపేట వీధిలోని ఈద్గా వద్ద గురువారం ఉదయం వేలాది మంది ప్రార్థనలు చేయనున్నారు. దీంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఈద్గా పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈద్గా వద్ద పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీటి వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ముస్లింలకు మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, చంద్రపాల్ రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.

భారతీయ సంస్కృతిని కాపాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ విభాగ్ సహ సంపర్క్ ప్రముఖ్ అంబరీష్

పెద్దశంకరంపేట, మార్చి 30: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెదక్ విభాగ్ సహ సంపర్క్ ప్రముఖ్ అంబరీష్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ జయంతి సందర్భంగా ధ్వజారోహణ గావించారు. కేశవరావు బలరాయ్ పంత్ హెడ్గేవార్ సూచించిన దారిలో యువత పయనించాలన్నారు.

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రవీంద్రభారతీలో ఉగాది పురస్కారాన్ని బ్రహ్మశ్రీ వెంకటేశ్వరశర్మకు ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ శ్రీధర్ ఆదివారం అందజేశారు.

ప్లాస్టిక్ భూతం..ప్రాణాంతకం

- అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తు అంధకారం
- ప్రళయం కన్నా ప్లాస్టిక్‌తోనే పెద్ద ప్రమాదం
- అధికారులు జరిమానాలు వేసినా తప్పని విక్రయాలు

రామాయంపేట, మార్చి 30: పాలిథిన్ బ్యాగులు ఓ పెను భూతం లాంటివి. ఇవి ప్రజల జీవితాలను దహించివేస్తాయి. వీటితో పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుంది. కాగితాలు మట్టిలో కరిగిపోతాయి. ప్లాస్టిక్ కవర్లు శతాబ్దాలైనా మట్టిలో కరిగిపోవు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో పరిశ్రమలు ఇష్టానుసారంగా నాణ్యత లేకుండా కవర్లు తయారు చేస్తుండడం, వాటిని వ్యాపారస్తులు వాడడం మామూలైపోయింది. పాలిథిన్ కవర్ల వ్యర్థాలతో కలిగే నష్టాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేసినా ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు.

చెట్లపైనా ప్లాస్టిక్ వ్యర్థాలు

పటాన్‌చెరు, మార్చి 24: క్యారీబ్యాగులు చెట్ల కొమ్మల్లో చిక్కుకుని రంగురంగుల పూవ్వుల్లా దర్శనమిస్తున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న చెత్త భూమితో పాటు చెట్లను అందవికారం చేస్తూ పర్యావరణంపై సవాల్ విసురుతున్నవి. ఈ చెత్త చెట్టు పటాన్‌చెరు మండలం రుద్రారంలో నమస్తే తెలంగాణ కెమెరాకు చిక్కింది.

వ్యాపారులకు నోటీసులిచ్చాం

పాల్‌థిన్ కవర్లు వాడవద్దంటు వ్యాపార సంస్థలకు నోటీసులిచ్చాం. కొంత మంది నోటీసులను పెడచెవిన పెడ్తున్నారు. ఇంటింటికీ, దుకాణాలకు తిరిగి నోటీసులిచ్చి, వ్యాపారులకు చెప్పాం. అయినా వాడకాన్ని ఎవరూ ఆపడం లేదు. వ్యాపారులకు నోటీసులిచ్చి మళ్లీ వారితో సంతకాలు తీసుకుంటాం. అలాగే విక్రయిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తాం.

- దేవేందర్, మున్సిపల్ కమిషనర్, రామాయంపేట

షాపులో ఉన్న ప్లాస్టిక్‌క్యారీ బ్యాగులు

సొసైటీ చైర్మన్‌కు సతీవియోగం

పాపన్నపేట, మార్చి 30: తెలంగాణలోనే రెండో పెద్ద సొసైటీగా పేరుగాంచిన కొత్తపల్లి (ఎఫ్ఏసీఎస్) రైతు సేవా సహకార సంఘం చైర్మన్ త్యాగర్ల రమేశ్‌కు సతీవియోగం కలిగింది. రమేష్ సతీమణి సుజాతమ్మ(59) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో మెట్లపై నుంచి జారిపడి మృతి చెందింది. సుజాత మృతిపై మండలంలోని వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
HOUSE FOR SALE
★రుద్రారం ముంబై హైవే ఫేసింగ్ విల్లాలు, HMDA, RERA, Bank Loans, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ అద్భుతమైన వెంచర్‌లో అమ్మకానికి కలవు. 9912759000.
NT-331083
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్నీ గమనించగలరు.